క్లుప్తంగా

టీటీడీకి రెండు ద్విచక్ర వాహనాల బహూకరణ



ద్విచక్ర వాహనాలను అందిస్తున్న దాతలు

తిరుమల: తిరుమల శ్రీవారికి మంగళవారం చెన్నైకి చెందిన టీవీఎస్, బెంగళూరుకు చెందిన ఎన్‌డీఎస్ ఎకో సంస్థల ప్రతినిధులు విద్యుత్ ద్విచక్ర వాహనాలను విరాళంగా అందించారు. టీవీఎస్ ఐ క్యూబ్ ఎక్స్ వాహనం ధర రూ.2.7 లక్షలు, ఎన్ డీఎస్ ఎకో వాహనం ధర రూ.1.56 లక్షలు అని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ముందుగా ఆలయం వద్ద ఆయా వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహనాల తాళాలను టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరికి ఆయా సంస్థల ప్రతినిధులు అందజేశారు. టీవీఎస్ చైర్మన్ వేణుశ్రీనివాసన్, ఎండీ సుదర్శన్, తిరుమల డీఐ సుబ్రమణ్యం, ఎన్ డీఎస్ ఎకో సంస్థ చైర్మన్ ఎంహెచ్.రెడ్డి పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

చంద్రగిరి: ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి మరోకారు ఢీకొనడంతో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ఐతేపల్లి వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పీఏ చంద్ర తన కారులో వ్యక్తిగత పనులు ముగించుకుని మంగళవారం గూడూరుకు తిరుగు ప్రయాణమయ్యాడు. ఐతేపల్లి వద్ద వస్తున్న క్రమంలో వెనుక నుంచి వచ్చిన స్విఫ్ట్ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రతో పాటు మరో కారులో ఉన్న సీత్‌రాజ్ స్వల్పంగా గాయపడ్డారు. అనంతరం క్షతగాత్రులు మరొక వాహనాల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు. తెల్లవారుజామున పొగమంచు కారణంగానే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ సైన్స్ మహిళా దినోత్సవం



ఐజర్‌లో మహిళా ప్రొఫెసర్లు

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం, జంగాలపల్లి సమీపంలోని తిరుపతి ఐజర్‌లో మంగళవారం రాత్రి అంతర్జాతీయ సైన్స్ మహిళా, బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్లోబల్ ఉమెన్ బ్రేక్‌ఫాస్ట్–2025 పేరుతో లింగసమానత్వం సాధనపై మహిళా ప్రొఫెసర్లు, విద్యార్థినులు చర్చాగోష్ఠి నిర్వహించారు.

అన్నదాతకు హైటెన్షన్!

- రైతు గుర్తింపు కార్డులకు ఈనెల 25 వరకు గడువు
- ముందుగా పీఎం కిసాన్ పొందే వారికి ప్రాధాన్యం
- గుర్తింపు కార్డు ఉంటేనే బ్యాంక్ రుణాలు, ప్రభుత్వ పథకాలు



వరదయ్యపాలెం మండలం, మరదవాడ గ్రామంలోని రైతు భరోసా కేంద్రం

తిరుపతి అర్బన్: అన్నదాతలను కూటమి ప్రభుత్వం టెన్షన్‌లో పెడుతోంది. ప్రతి రైతూ గుర్తింపు కార్డు తీసుకోవాలంటూ కొత్త మెలిక పెట్టింది. కార్డు పొందడానికి ఈనెల 25వ తేదీ వరకు మాత్రమే గడువు విధించింది. రైతు సేవా కేంద్రాల్లో (రైతు భరోసా కేంద్రాలు)ఏపీ రిజిస్ట్రీ పోర్టల్లో మాత్రమే చేయించుకోవాలని సూచించింది. ముందుగా పీఎం కిసాన్ పథకం పొందుతున్న రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని వెల్లడించింది. తర్వాత సొంత భూములున్న అందరి రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్టు పేర్కొంది. అయితే కౌలు రైతుల మాట ఎక్కడా ప్రస్తావించకపోవడం విమర్శలకు తావిస్తోంది. రైతు గుర్తింపు కార్డు ఉంటేనే బ్యాంక్ రుణాలు, సబ్సిడీ ఇవ్వాలన్నా.. ప్రభుత్వ పథకాలు పొందాలన్నా.. గుర్తింపు కార్డులే ప్రామాణికంగా చెబుతున్నారు. దీంతో రైతులు ఆందోళనలో మునిగిపోయారు. బుధవారం నుంచి రైతు సేవా కేంద్రాల్లో రైతులు బారులు తీరాల్సి ఉంది.

రైతులు బిజీబిజీ

వరి ఒబ్బిళ్లు ఫిబ్రవరి 1 నుంచి జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. మే 31 వరకు ఈ ఒబ్బిళ్లు ఉంటాయి. దీంతో రైతులు ఉదయం నుంచి రాత్రి వరకు పొల్లాలోనే బిజీగా గడుపుతున్నారు. ఇలాంటి తరుణంలో కూటమి ప్రభుత్వం రైతు గుర్తింపు కార్డులకు 13 రోజులు గడువు అందించడంపై సర్వత్రా గందరగోళం నెలకొంది.

కార్డులేకుంటే గోవిందా?

రైతు గుర్తింపు కార్డు ద్వారా సకల సౌకర్యాలు కలగనున్నాయి. ఇందులో ప్రభుత్వ సబ్సిడీలు, పంట బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ పథకం, తుపాన్లతో పాటు ప్రకృతి వైపరీత్యాల్లో పంట నష్టానికి పరిహారం తదితరాలు అందనున్నాయి. కార్డు లేకుంటే ఇవన్నీ ఆగిపోనున్నాయి.

11 అంకెలతో గుర్తింపు కార్డు



రైతులకు 11 అంకెలతో ప్రత్యేక గుర్తింపు కార్డు అందించనున్నాం. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయాలన్న సంకల్పంతో కేంద్రం ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 25వ తేదీ లోపు అందరూ రైతు సేవా కేంద్రాల్లో గుర్తింపు కార్డును పొందాలి.

–ఎస్.వెంకటేశ్వర్, జిల్లా కలెక్టర్

రైతులందరికీ కార్డులు



భూములున్న రైతులు అందరికీ విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వాలనే ఉద్దేశంలో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 11 అంకెలతో ఉన్న గుర్తింపు కార్డును గుర్తుపెట్టుకోవాల్సి ఉంటుంది. ఈ సంఖ్య ఉన్నవారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయి. –ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఇది సరికాదు



కూటమి సర్కార్ ఇప్పటి వరకు రైతులకు ఏమీ చేయలేదు. అన్నదాత సుఖీభవ మాటేలేదు. అయితే ఏదో ఒక హడావుడి మాత్రం చేస్తున్నారు. జిల్లాలో 2 లక్షల మంది రైతులు ఉన్నారు. రబీ సీజన్ నేపథ్యంలో అంతా జోరుగా పొలం పన్నుల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ క్రమంలో రెండు వారాలు మాత్రమే గడువు ఇవ్వడం ఏ మాత్రం సరికాదు. 25 లోపు రైతు సేవా కేంద్రాల్లో మాత్రమే చేయించుకోవాలని చెబితే...రైతులు అంతా క్యూ కట్టాల్సి ఉంది. లేదంటే నెట్‌సెంటర్లు, మీ సేవా కేంద్రాలకు తదితర అన్నింటికి ఇస్తే రైతులకు ఇబ్బందులు ఉండవు. –మల్లికార్జునరెడ్డి, సిద్ధాపురం గ్రామం రైతు, వరదయ్యపాళెం మండలం

జేఈఈ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



అభిరామ్ ఓ.మోక్షిత్ శర్మ జీవన్ కుమార్ నిఖిల్



ప్రీతమ్ చౌదరి వెంకట్ వరుణ్‌తేజ్ గంగా మనోజ్ కుమార్

తిరుపతి ఎడ్యుకేషన్: ఎన్‌టీఏ గత నెల 21వతేదీ నుంచి నిర్వహించిన జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్ష ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, టాప్ పర్సంటైల్ సాధించారని కళాశాల ఏజీఎమ్ బీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో అభిరామ్, ఓ.మోక్షిత్ శర్మ 99.8 పర్సెంటైల్ సాధించగా, జీవన్ కుమార్ 99.2, నిఖిల్ 99.0, మంజునాథ్ 98.7, ప్రీతమ్ చౌదరి 98.6, సి.వెంకట్ వరుణ్‌తేజ్ 98.2, గంగా మనోజ్ కుమార్ 98.2 పర్సెంటైల్ సాధించి విజయదుదుంబి మోగించారని హర్షం వ్యక్తంచేశారు. అధ్యాపకుల కృషి, కళాశాల పటిష్ట ప్రణాళికతోనే విద్యార్థులు విజయం సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అధ్యాపకులు, యాజమాన్యం అభినందించారు.

ట్రైనీ ఐపీఎస్ అధికారి బాధ్యతల స్వీకరణ



తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ట్రైనీ ఐపీఎస్ అధికారి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో శిక్షణ నిమిత్తం ట్రైనీ ఐపీఎస్ అధికారి బీ.హేమంత్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం నుంచి ఆయన నెల రోజుల పాటు పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ ఎఫ్ఐఆర్ నమోదు నుంచి కేసుల దర్యాప్తు వరకు వివిధ అంశాలపై పూర్తి స్థాయిలో శిక్షణ తీసుకోనున్నారు. ట్రైనీ ఐపీఎస్ అధికారి హేమంత్‌కు చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, సీఐ చిన్నగోవిందు, ఎస్ఐలు రామకృష్ణ, ఎస్‌కె.మూర్తి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందిని పరిచయం చేశారు. అంతకుముందు ట్రైనీ ఐపీఎస్ అధికారి హేమంత్ తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలసి రిపోర్ట్ చేసుకున్నారు.

రైల్వే గ్యాంగ్‌మన్ మృతి

– మరొకరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన అభిషేక్(ఫైల్)

తడ: రైల్వే ట్రాక్‌పై గ్యాంగ్ మన్‌లు పనిచేస్తున్న సమయంలో అకస్మాత్తుగా రైలు రావడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. రైల్వే సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. తడ మండల పరిధిలోని అనపగుంట రైల్వే గేటు సమీపంలో చెన్నై వైపు వెళ్లే మార్గంలో మంగళవారం ఇద్దరు గ్యాంగ్ మన్‌లు పనిచేస్తున్నారు. అదే సమయంలో అకస్మాత్తుగా రెండు ట్రాకులపై ఒకేసారి రైళ్లు రావడంతో ప్రమాదం చోటుచేసుకుంది. పనిలో నిమగ్నమైన సిబ్బందికి వెనుక వస్తున్న రైలు శబ్దం వినిపించలేదు. రైలు దగ్గరగా వచ్చిన సమయంలో వెనుక నుంచి చెన్నై వైపు వెళ్లే టాటానగర్ – ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలు కూత వినిపించడంతో తప్పించుకునే ప్రయత్నం చేశారు. రైలు దగ్గరకు వచ్చేయడంతోపాటు పక్క ట్రాక్‌లో మరో ట్రైన్ వెళుతుండడంతో ఎటు వెళ్లాలో తెలియని స్థితి నెలకొంది. దీంతో ట్రాక్ మెయిన్‌టైనర్‌గా పనిచేస్తున్న కేరళకు చెందిన ఏఆర్ అభిషేక్(30) పట్టాలపై పరుగులు తీశాడు. వేగంగా వస్తున్న రైలును తప్పించుకోలేకపోవడంతో ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. అతనితోపాటు గ్యాంగ్ మేస్త్రీగా పనిచేస్తున్న బిహార్‌కి చెందిన మంజయ్ కుమార్(33) ఎడమ వైపుకు ఎగిరి దూకగా అతని కాలుకు రైలు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ మంజయ్‌ని 108 సిబ్బంది ఈఎంటీ శుభకర్, పైలెట్ దేవా ప్రథమ చికిత్స చేసి సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తీసుకెళ్లారు.

నేరాల కట్టడే లక్ష్యం

తిరుపతి క్రైమ్: జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను పెంచి నేర నియంత్రణ కట్టడి చేసినట్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను పెంచి, గత వారం రోజుల్లో సాధించిన పురోగతి వివరాలను మంగళవారం వెల్లడించారు. రాత్రిపూట రోడ్లపై తిరుగుతున్న 165 మంది అనుమానిత వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్టు వెల్లడించారు. అలాగే అక్రమంగా తరలిస్తున్న గంజాయి సుమారు 41.5 కిలోలను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. బహిరంగంగా మద్యం సేవించే వారిపై 913 కేసులు నమోదు చేసి 913 మందికి కోర్టులో జరిమానాలు పడేలా చర్యలు చేపట్టామన్నారు.



రేణిగుంట- తిరుపతి రహదారిపై ఆవుల సమూహం

గోమాత ఘోష

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంటలో గోమాత ఘోషిస్తోంది. యజమానులు పాలు మాత్రం పిండుకుని పట్టించుకోకపోవడంతో నడిరోడ్డుపై అలమటిస్తోంది. కనిపించిన వ్యర్థాలను భుజిస్తూ క్షుద్బాధను తీర్చుకుంటోంది. వివరాలు.. పట్టణంలో సుమారు వందకు పైగా పశువులు రోడ్లపైనే ఉంటున్నాయి. వాహనాలకు అడ్డుపడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నాయి. చివరకు రైల్వేట్రాక్‌పై సైతం తిరుగుతూ చూపరులను భయపెడుతున్నాయి. ఈ క్రమంలోనే రేణిగుంలో పలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రధానంగా రాత్రి వేళల్లో ద్విచక్రవాహనదారులకు మృత్యుఘంటికలు మోగిస్తున్నాయి. ఏమాత్రం ఏమారుపాటుగా వచ్చినా నిలువునా రోడ్లపై కూలదోస్తున్నాయి. తీవ్రమైన గాయాలతో ఆస్పత్రిపాలయ్యే దుస్థితిని తీసుకువస్తున్నాయి. ఈ మేరకు పంచాయతీ అధికారులు, పోలీసుల అలసత్వంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాత్రింబవళ్లు రోడ్లపై సంచరిస్తున్న పశువులను కట్టడి చేయడంలో వైఫల్యం చెందుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు. పంచాయతీ సిబ్బంది స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గోవులను వాటి యజమానులు పట్టించుకోకుంటే టీటీడీ నిర్వహిస్తున్న గోశాలకు అయినా తరలించాలని సూచిస్తున్నారు. పశువుల కారణంగా తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు కృషి చేయాలని స్పష్టం చేస్తున్నారు. ఆవులను విచ్చలవిడిగా రోడ్లపై వదిలేస్తున్న యజమానులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



రేణిగుంటలో రైల్వే ట్రాక్‌పై సంచరిస్తున్న ఆవులు

హిందూ ధర్మాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న అదనపు ఈఓ వెంకయ్యచౌదరి

తిరుమల: టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ద్వారా నేర్చుకున్న ప్రతి విషయాన్ని భక్తుల్లోకి తీసుకెళ్లాలని టీటీడీ అదనపు ఈఓ వెంకయ్యచౌదరి సూచించారు. తిరుమలలో బుధవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవ కార్యక్రమం ఆస్థాన మండపంలో మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అదనపు ఈఓ భక్తులనుద్దేశించి ప్రసంగించారు. 1979లో టీటీడీ ప్రారంభించిన దాస సాహిత్య ప్రాజెక్టు సంకల్పం పరిపూర్ణమై ప్రజల్లోకి వెళ్లిందని చెప్పారు. దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు మాట్లాడుతూ ఒక్కసారి మెట్లోత్సవంలో పాల్గొంటే 108 సార్లు స్వామివారిని దర్శించుకున్న పుణ్యఫలం దక్కుతుందన్నారు. ప్రవచనకర్త హయగ్రీవాచార్యులు, ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటకకు చెందిన భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.



హాజరైన భజన మండలి సభ్యులు

సమ్మెకాలపు ఒప్పందాల సాధనకు సన్నద్ధం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు

తిరుపతి కల్చరల్: అంగన్‌వాడీ కార్మికుల సమ్మెకాలపు ఒప్పందాల సాధనకు కార్మికులంతా సన్నద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర సమితి విస్తృత సమావేశం మంగళవారం తిరుపతిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో 42 రోజులు సమ్మె ఉద్యమాల ఫలితంగా ఒప్పందం చేసుకున్న అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి నేతలు వేతనాలు సకాలంలో చెల్లిస్తామని, పెరిగిన వేతనాలు ఇప్పిస్తామని హామీలు గుప్పించారని తెలిపారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా సమ్మె కాలం ఒప్పందాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరో అంగన్‌వాడీ ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ, రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు ఎస్.మంజుల, ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, నగర కార్యదర్శి ఎన్‌డీ.రవి పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించే వరకు సమ్మె



9వరోజు సమ్మెలో పాల్గొన్న వెటర్నరీ వైద్య విద్యార్థులు

తిరుపతి సిటీ: తమ న్యాయపరమైన సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం దారుణమని, సమస్య పరిష్కారమయ్యేవరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని వెటర్నరీ జూడాలు తేల్చిచెప్పారు. మంగళవారం వర్సిటీలో వెటర్నరీ వైద్యులు చేపట్టిన సమ్మె 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా గౌరవ వేతనం పెంచాలని రోడ్డున పడి గొంతెండిపోయేలా అరుస్తున్నా అధికారులలో చలనం లేకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మిగిలిన వైద్య విభాగాల్లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థులకు అందించే గౌరవ వేతనాన్ని తమకు కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమానికి పాటు పడుతున్న వెటర్నరీ జూడాలకు ప్రభుత్వం తక్షణం గౌరవ వేతనాన్ని పెంచి ఆదుకోవాలని కోరారు. కేవలం రూ.10 వేలు చెల్లిస్తామని పుకార్లు పుట్టిస్తున్నారని, అందుకు తాము అంగీకరించమని చెప్పారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోండి

తిరుపతి అర్బన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికి ప్రతి అసంఘటిత కార్మికుడు తన వివరాలను ఈ -శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఈ – శ్రమ్ పోర్టల్ పై సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు ఈ- శ్రమ పోర్టల్‌లో వారి పేర్లు నమోదు చేసుకోవడం ద్వారా వారికి సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. కార్మికులతోపాటు వారి కుటుంబ సభ్యులు కూడా ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఈ ప్రక్రియకు వయసు పరిమితి 16–59 సంవత్సరాల వరకు ఉందన్నారు. ఆదాయపు పన్ను చెల్లించని వారు, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం లేని వారు, నెలకు రూ.15 వేల లోపు జీతం తీసుకునేవారు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. ఈ పథకంలో చేరిన వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా, అంగవైకల్యం అయితే రూ.లక్ష వరకు ఆర్థిక సహాయం అందుతుందన్నారు.

క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీఎన్ఎస్ నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద గిరిజన నవ సమాజ్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సంత్ శ్రీసేవాలాల్ 286వ జయంతి మహోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. మంగళవారం ఈ మేరకు జీఎన్ఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ నాయక్ మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు. సేవాలాల్ జయంతిని కేంద్ర ప్రభుత్వం జాతీయ పండుగగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2కోట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు చంద్రశేఖర్ నాయక్, సునీల్ నాయక్, బాలు నాయక్, మాసుమయ్య, భార్గవ్ సాయి, సూర్య పాల్గొన్నారు

ఉచితంగా హెల్మెట్‌ల పంపిణీ



హెల్మెట్ అందిస్తున్న గెహిణిరెడ్డి, సీఐ రామకృష్ణ

తిరుపతి కల్చరల్ : అన్నమయ్య కూడలి వద్ద మంగళవారం డాలర్స్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ సి.గెహిణిరెడ్డి, వెస్ట్ సీఐ రామకృష్ణ 100 మంది ద్విచక్రవాహనదారులకు ఉచితంగా హెల్మెట్‌లు పంపిణీ చేశారు. గెహిణిరెడ్డి మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ క్రమంలోనే తమ ట్రస్ట్ ద్వారా విస్తృతంగా సేవా కార్యాక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

కోదండరాముని పేట ఉత్సవం రేపు

తిరుపతి కల్చరల్/ తిరుపతి రూరల్ : శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో గురువారం ఘనంగా పేట ఉత్సవం నిర్వహించనున్నారు. మాఘ పౌర్ణమి సందర్భంగా సీతాలక్ష్మణ సమేత స్వామివారి ఉత్సవమూర్తులను కూపుచంద్రపేట గ్రామానికి ఊరేగింపుగా వేంచేపు చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా ఉదయం 6 గంటలకు ఆలయం నుంచి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు ఊరేగింపుగా బయలుదేరి తిరుపతికి 8 కిలోమీటర్ల దూరంలోనున్న కూపుచంద్రపేటకు చేరుకుంటారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు స్నపన తిరుమంజనం, ఆస్థానం జరిపించనున్నారు. సాయంత్రం ఊంజల్ సేవ అనంతరం గ్రామోత్సవంగా ఆలయానికి చేరుకుంటారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్ రేపు

పాకాల : స్థానిక సబ్‌స్టేషన్‌లో గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు తిరుపతి రూరల్ డివిజన్ ఈఈ చిన్నరెడ్డెప్ప తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 15వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు చేపట్టనున్న నేపథ్యంలో తిరుమంజనం జరిపించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంతోపాటు పూజా సామగ్రిని శుద్ధి చేసి, సుగంధ ద్రవ్యాలతో ప్రోక్షణ చేయనున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



శ్రీవారి ఆలయం వెలుపల సినీ నటుడు కార్తీ

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీ.విజయ్ సేన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు ఠాకూర్, సినీ నటుడు కార్తీ, కుటుంబసభ్యులు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

సిరులతల్లి సేవలో..

తిరుపతి రూరల్ : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని మంగళవారం సినీనటుడు కార్తీ కుటుంబ సమేతంగా సేవించుకున్నారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రసాద్ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న అనంతరం కార్తీ, కుటుంబసభ్యులకు ఆలయాధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

• పులకించిన పుష్కరిణి





శ్రీగోవిందరాజస్వామి తెప్పోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా దేవదేవేరులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. అనంతరం సర్వాంలంకారశోభితులైన స్వామి, అమ్మవార్లు తెప్పపై కొలువుదీరారు. పుష్కరిణిలో ఏడు ప్రదక్షిణలు చేస్తూ భక్తులను ఆశీర్వదించారు. అనంతరం మాడవీధుల్లో ఊరేగుతూ దర్శనమిచ్చారు. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ పాల్గొన్నారు. – తిరుపతి కల్చరల్

• పోటెత్తిన 'పుస్తకం'



భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనపై శనివారం రాత్రి మతోన్మాదులు చేసిన దాడికి నిరసన వెల్లువెత్తింది. మంగళవారం ఈ మేరకు తిరుపతిలోని పుస్తక ప్రియుల ఐక్య వేదిక భారీ ర్యాలీ చేపట్టింది. వాకా ప్రసాద్, సాకం నాగరాజు, భూమన్, మస్తానమ్మ, పి.అంజయ్య, వి.నాగరాజు, రాఘవ శర్మ, ప్రసాద్, బుసగాని లక్ష్మయ్య, యువశ్రీ మురళి, వెంకటరత్నం పాల్గొన్నారు. – తిరుపతి కల్చరల్

మన ఆవిష్కరణ.. మనకే సొంతం

- అవగాహన లోపంతో నవీన ఉత్పత్తులపై హక్కులు కోల్పోతున్న పలువురు ఔత్సాహికులు
- మహిళా వర్సిటీలో తొలిసారిగా పేటెంట్ రైట్స్.. డ్రాఫ్టింగ్.. ఫైలింగ్‌పై జాతీయ సదస్సు
- హాజరైన విద్యార్థులు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు
- అవగాహన కల్పించిన ప్రముఖ విద్యాసంస్థల అధ్యాపకులు

వినూత్న ఆలోచనలు వృథా కాకుండా.. నవీన పరిశోధనలు నిరుపయోగంగా మారకుండా.. సరికొత్త ఆవిష్కరణలపై సర్వాధికారాలు పోకుండా.. పరిశోధకులను అప్రమత్తం చేసేలా.. ఔత్సాహికులు ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం నుంచి ఐదురోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ మీడియం ఎంటర్‌ప్రైజస్ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తలు.. అన్ని రంగాల నిపుణులను జాగృత పరిచేందుకు నడుం బిగించారు. దేశంలోనే తొలిసారిగా పేటెంట్ రైట్స్.. డ్రాఫ్టింగ్.. ఫైలింగ్ తదితర అంశాలపై ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. పలువురు మేధావులు వ్యయప్రయాలకోర్చి ఏళ్ల తరబడి శ్రమించి రూపొందించిన ఉత్పత్తులపై హక్కులు సాధించడంలో విఫలమవుతున్నారు. దాదాపు 70శాతానికి పైగా పరిశోధకులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఐఐటీ, ఐజర్, బిట్స్ పిలానీ తదితర ప్రముఖ విద్యాసంస్థల అధ్యాపకులతో క్షుణ్ణంగా అవగాహన కల్పిస్తున్నారు. ఇన్నోవేటర్స్ అందరూ తమ ఆవిష్కరణలపై తామే సర్వహక్కులు పొందేలా చట్టాలను వివరిస్తున్నారు. దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివద్ధే లక్ష్యంగా పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తున్నారు. అడ్వాన్స్‌డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ పేరుతో దిశానిర్దేశం చేస్తున్నారు. – తిరుపతి సిటీ



జాతీయ సదస్సుకు హాజరైన అధ్యాపకులు, మహిళా పారిశ్రామిక వేత్తలు, ఇన్నోవేటర్స్

సదస్సులు అవసరం



పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేందుకు ఇలాంటి జాతీయ సదస్సులు అవసరం. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్‌పై పేరొందిన పరిశోధనా సంస్థల నిపుణులు శిక్షణ ఇచ్చారు. చాలా నూతన విషయాలను తెలుసుకున్నాం. విద్యార్థులకు పేటెంట్ హక్కుల సాధనపై అవగాహన కల్పించేందుకు సదస్సు ఎంతో ఉపకరించింది. స్టార్టప్ ఇండియాగా రూపాంతరం చెందేందుకు ఇలాంటి శిక్షణ అవసరం.
– ప్రొఫెసర్ బి.రమాకుబేర్, మహిళా వర్సిటీ

కీలక అంశాలపై అవగాహన



నూతన పరిశోధకులు, ఆవిష్కకర్తలకు ఎంతో ఉపయోగకరమైన సమాచారం సదస్సు ద్వారా లభించిందని చెప్పవచ్చు. విద్యార్థి దశ నుంచి పేటెంట్ హక్కులపై అవగాహన కల్పించేందుకు పలు విభాగాల అధ్యాపకులకు అవగాహన కల్పించారు. సదస్సులో స్టార్టప్ ఇండియాకు సంబంధించి కీలక అంశాలపై అవగాహన వచ్చింది. ఆ మేరకు పట్టు సాధించగలిగాం. – ప్రొఫెసర్ పి.తవితా తులసి, హెచ్ఓడీ, మహిళా వర్సిటీ

గర్వంగా ఉంది



నూతన ఆవిష్కరణలను రూపొందించడంలో దేశం ప్రథమస్థానంలో ఉంది. కానీ పేటెంట్ హక్కులను సాధించడంలో చాలా వరకు వెనుకబడి ఉన్నాం. దీంతో శ్రమకు తగిన ఫలితం దక్కించుకోవడంలో విఫలమవుతున్నాం. కనిపెట్టిన నూతన ప్రొడక్ట్స్‌పై సర్వహక్కులను సొంతం చేసుకోవడమే ప్రధాన అంశాలుగా ప్రత్యేక శిక్షణ ఇచ్చే సదస్సును తొలిసారిగా మహిళా వర్సిటీలో నిర్వహించడం గర్వంగా ఉంది.
– ప్రొఫెసర్ డీఎమ్ మమత, మహిళా వర్సిటీ

నిపుణులతో శిక్షణ



పేటెంట్ అప్లికేషన్, డ్రాఫ్టింగ్, ఫైలింగ్ వంటి అంశాలపై పలు విభాగాల అధ్యాపకులు, ఆవిష్కర్తలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. దేశంలోని పలు ప్రాంతాల నుంచి నిపుణులు హాజరై చక్కటి ఉదాహరణలతో అవగాహన కల్పించారు. భావి భారత పారిశ్రామికాభివృద్ధికి, నూతన పరిశోధకులకు ఇది అవసరం.
– ప్రొఫెసర్ విద్యావతి, మహిళా వర్సిటీ

అవగాహనలోపంతోనే..



భారతదేశంలో పరిశోధనలకు కొదవలేదు. విశ్వ గురువుగా మనదేశం వెలుగొందుతోంది. కానీ, నూతన ఆవిష్కరణలలో కేవలం 30శాతం మాత్రమే పేటెంట్ హక్కులను పొందగలుతున్నాం. మేధోశక్తితో శ్రమించి పేటెంట్ హక్కుల సాధనలో విఫలం చెందడం దేశ ప్రోగతికి ఆటంకం. పేటెంట్ హక్కులపై అవగాహన కల్పించాలన్నదే సదస్సు లక్ష్యం
– డాక్టర్ అంబరీష్ సక్సేనా, ప్రిన్సిపల్, సైంటిఫిక్ ఆఫీసర్, ఐజర్, తిరుపతి

సీమ పందుల పెంపకంపై శిక్షణ



మాట్లాడుతున్న పరిశోధన సంచాలకులు

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ వర్సిటీ నిరంతర పశు వైద్యం, సమాచారం కేంద్రం ఆధ్వర్యంలో సీమ పందుల పెంపకం, గ్రామీణ వ్యవస్థాపకతపై ఐదురోజుల శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. పరిశోధన సంచాలకులు శ్రీలత, విస్తరణ సంచాలకులు డాక్టర్ శోభామణి మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతులతో సీమ పందుల పెంపకం చేపడితే అధిక ఆదాయం పొందే అవకాశముంటుందన్నారు. అందులో భాగంగానే రైతులకు శాస్త్రీయ విధానంలో కోళ్లు, సీమ పందుల పెంపకంపై క్రమం తప్పకుండా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ డాక్టర్ సుజాత, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, గంగరాజు, మంజరి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమల క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 76,169 మంది స్వామివారిని దర్శించుకోగా 24,559 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.33 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయానికన్నా ముందు వచ్చే భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

ఎర్రచందనం కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కేసులో తమిళనాడు, వేలూరు జిల్లా, తిరుపత్తూరు తాలూకా, అన్నేరికి చెందిన ఎస్.అన్నామలైకి ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ ప్రత్యేక కోర్టు జడ్జి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం.. 2014 మార్చి 27వ తేదీ తిరుపతి ఎర్రచందనం ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది చంద్రగిరి నుంచి పూతలపట్టు బైపాస్ రోడ్డు నడింపల్లి సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో నిందితుడు అన్నామలై కారులో 292 కిలోల 9 ఎర్రచందనం దుంగలను తరలిస్తూ పట్టుబడ్డాడు. ఫారెస్ట్ అధికారులు నిందితుడు అనామలైని అరెస్ట్ చేసి తిరుపతి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరపరిచారు. నేరం అతనిపై రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడు అన్నామలైకి శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ కోటేశ్వర్‌రెడ్డి వాదించారు.

అలరించిన 'స్వరాభిషేకం'



కళాకారులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : మహతి కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించిన ఘంటసాల స్వరాభిషేకం అలరించింది. ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో అమరాతి ఆర్ట్స్ అసోసియేషన్ వారు ఈ కార్యక్రమం చేపట్టారు. చిత్తూరు జెడ్పీ మాజీ సీఈఓ భరత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు పీఎస్ రవికుమార్, నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపల్ బి.వెంకటరమణలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమరావతి ఆర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి శివాజీ, సభ్యులు సరస్వతి పాల్గొన్నారు.

'రహదారి భద్రత'లో రక్తదానం



అలిపిరి డిపోలో రక్తదానం చేస్తున్న డ్రైవర్లు




ప్రశంసాపత్రం అందిస్తున్న డీపీటీఓ నరసింహులు

తిరుపతి అర్బన్ : తిరుపతి ఆర్టీసీ డిపో, అలిపిరి డిపోలోని డ్రైవింగ్ స్కూల్‌లో మంగళవారం రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిబిరాల్లో ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్‌లు, శిక్షణ పొందుతున్నవారు రక్తదానం చేశారు. అలిపిరిలో 17 యూనిట్లు, తిరుపతి డిపోలో 21 మంది రక్తదానం చేశారు. ఎంవీఐ కుసుమ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఎస్వీఆర్ఆర్ ప్రభుత్వాస్పత్రి వైద్యుల పర్యవేక్షణలో చేపట్టిన శిబిరాల్లో రక్తదాతకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో డీపీటీఓ నరసింహులు, డిపో మేనేజర్లు హరిబాబు, బాలాజీ పాల్గొన్నారు.

18 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ 18న ధ్వజారోహణం, పెద్దశేష వాహనం, 19న చిన్నశేష వాహనం,హంస వాహనం, 20న సింహ వాహనం, ముత్యపుపందిరి వాహనం, 21న కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, 22న పల్లకీ ఉత్సవం, గరుడ వాహనం, 23న హనుమంత వాహనం, స్వర్ణరథోత్సవం, గజ వాహనం, 24న సూర్యప్రభ వాహనం,చంద్రప్రభ వాహనం, 25న రథోత్సవం, అశ్వవాహనం, 26న చక్రస్నానం, ధ్వజావరోహణంతో ఉత్సవాలు పరిపూర్ణం కానున్నట్లు వివరించారు.

వినియోగదారుల సేవే లక్ష్యం



నూతన చైర్మన్‌ను సత్కరిస్తున్న బ్యాంకు సిబ్బంది

తిరుపతి అర్బన్ : వినియోగదారుల సేవే లక్ష్యంగా పనిచేయాలని బుల్డానా అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ నూతన చైర్మన్ డాక్టర్ సుకేష్‌జీ జమ్‌వార్ స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో కస్టమర్ మీట్ నిర్వహించారు. బ్యాంక్ చైర్‌పర్సన్ కోమల జమ్‌వార్‌తో కలసి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తక్కువ వడ్డీకే బంగారు రుణాలు, డిపాజిట్లపై అధిక వడ్డీ సౌకర్యం కల్పిస్తున్నామని వెల్లడించారు.

'మలబార్'లో ఆభరణాల ప్రదర్శన




ఆభరణాలను ప్రదర్శిస్తున్న మహిళలు

తిరుపతి కల్చరల్ : బాలాజీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో బ్రాండెడ్ బంగారు, వజ్రాలు, జాతిరత్నాభరణాల ప్రదర్శన ప్రారంభించారు. షోరూమ్ హెడ్ రిజేష్ మాట్లాడుతూ ప్రదర్శనలో 'మైన్' ధ్రువీకరణ వజ్రాభరణాలు, వివాహ, పార్టీ సంబరాల కోసం 'ఎరా' అన్కట్ వజ్రాలతో పొదిగిన విశిష్ట శ్రేణి 'ప్రెష్యా' జాతిరత్నాభరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే ఎత్నిక్స్ హస్తకళా నైపుణ్యతతో తయారైన ఆభరణాలు, 'డివైన్' సంప్రదాయ నగలు, చిన్నారుల కోసం 'స్టార్లెట్' ఆభరణాలు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. ఈ నెల 16వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో 'నారాయణ' ప్రతిభ

తిరుపతి ఎడ్యుకేషన్ : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని నారాయణ విద్యాసంస్థల డీఎంజీ కొండలరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎం.భానుచరణ్ రెడ్డి 99.99, మణిదీప్ రెడ్డి 99.98, నిఖిల్ 99.98, ధనుష్ 99.97, కార్తీక్ 99.93, యశ్విత 99.90 పర్సంటేజ్‌తో సత్తా చాటారని, అలాగే 99 పర్సంటేజ్ పైగా సుమారు 30 మంది విద్యార్థులు సాధించారని వివరించారు.

బ్లడ్ సెంటర్ సిబ్బందికి అభినందన



సిబ్బందిని అభిందిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ కుమార్

తిరుపతి తుడా : స్విమ్స్ బ్లడ్ సెంటర్ అందించిన ఉత్తమ సేవలకు నేషనల్ బ్లడ్ ట్రాన్స్‌ప్యూజన్ కౌన్సిల్ అవార్డు లభించింది. ఈ నెల 5వ తేదీన కేరళలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేశారు. మంగళవారం ఈ మేరకు బ్లడ్ సెంటర్ సిబ్బంది డాక్టర్ సురేష్ బాబు, సీనియర్ టెక్నీషియన్ పి.హరిప్రసాద్, ఎంఎస్ డబ్ల్యూ బి.శ్రీదేవిని స్విమ్స్ డైరెక్టర్, వీసీ ఆర్‌వీ కుమార్, విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్ బాబు అభినందించారు.

ఘంటసాలకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బాబు తదితరులు

తిరుపతి కల్చరల్ : ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం వీవీ మహల్ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి తిరుపతి ఫిలిమ్ సొసైటీ వారు పూలమాల వేసి నివాళులర్పించారు. సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు వైఎస్ బాబు, సీఆర్‌కే శేషగిరిరావు మాట్లాడుతూ ఘంటసాల గానం చిరస్మరణీయమని కొనియాడారు. సొసైటీ ప్రతినిధులు ఎస్.బుజ్జిబాబు నాయుడు, ఎస్.సుబ్రమణ్యం, భాస్కర్, బండి మధుసూదన్‌రెడ్డి, జి.శంకర్, జి.శాంతావాణి, ఆర్.అనసూయ, మేరీ జాయ్ పాల్గొన్నారు.

• విజేతలకు బహుమతులు



పాకాల మండలంలోని గాదంకి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మంగళవారం గాదంకి ఎన్ఏఆర్ఎల్ ఆధ్వర్యంలో పోటీలు జరిపించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. – పాకాల

ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు అభినందన



విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ : నర్సాపూర్ వేదికగా ఈనెల 3వతేదీ నుంచి ఏడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సమైక్యతా శిబిరానికి మహిళా వర్సిటీ నుంచి డాక్టర్ అనిత, వలంటీర్లు రీతిక, లావణ్య కుమారి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు మాధవి, స్వాతి హాజరయ్యారు. మంగళవారం ఈమేరకు వారిని వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని అభినందించారు.

పాకాల : జాతీయ సమైక్యత ఎన్ఎస్ఎస్ క్యాంపును ముగించుకుని వచ్చిన విద్యార్థి జి.వెంకటేష్‌ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.